ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విజయనగరం

జిల్లా వార్తలు

శుక్రవారం 1 ఆగస్టు 2025

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : ఆర్‌డీ

విజయనగరం రింగురోడ్డు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆర్‌డీ డి.రవీంద్ర సిబ్బందిని ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ చాంబర్లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ వసూళ్లలో లక్ష్యాలను అధిగమించాలన్నారు. నగర సుందరీకరణకు కార్యాచరణ రూపొందించి అమలుచేయాలన్నారు. ప్రధానంగా పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. సమావేశంలో కమిషనర్ నల్లనయ్య, సహాయ కమిషనర్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వారికి పన్నీరు.. వీరికి కన్నీరు..

- పెరిగిన ధరలు వ్యాపారులు, దళారులకే
- రైతులు, వినియోగదారులకు నష్టమే
- జిల్లాలో మార్కెట్ మాయాజాలం ఇదీ

● మార్కెట్‌లో కూరగాయలు, ఆకుకూరల ధరలు దడ పుట్టిస్తున్నాయి. కొనేందుకు వెళ్లేవారికి చుక్కలు చూపిస్తున్నాయి. ఈరోజు ఉన్నధర మరుసటి రోజు ఉండడంలేదు. ఫలితంగా సామాన్య, మధ్యతరగతి వర్గాలు బెంబేలెత్తి పోతున్నారు. రూ.500 నోటు పట్టుకెళ్లినా ఐదారు కిలోలు రాని పరిస్థితి.

● కూరగాయల ధరలు బాగా పెరిగాయి సరే. వాటిని పండించే రైతులు లాభపడుతున్నారని అనుకుంటే పొరపాటే. మార్కెట్‌లో కొందరు వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా కావడంతో.. వారు అడిగిన రేటుకే ఇవ్వాల్సిన పరిస్థితి. దీంతో రూ.వేలు పోసి.. ఆరుగాలం కష్టపడిన రైతులు నష్టపోతున్నారు.

● రైతులు నష్టపోకుండా వినియోగదారులకే నేరుగా కూరగయాలు అమ్మేందుకు ప్రభుత్వాలు రైతుబజార్లను అందుబాటులోకి తెచ్చాయి. అయితే ఇక్కడా వ్యాపారులదే హవా. రైతుల పేరిట తిష్టవేసి మార్కెట్ నుంచి తక్కువ ధరకు తెచ్చి ఇక్కడ ఎక్కువకు అమ్మేస్తున్నారు.


● మొత్తంగా రైతులు, వినియోగదారులు నష్టపోతున్నారు. మార్కెట్ మాయాజాలంలో కొట్టుకుని పోతున్నారు. మధ్యలో దళారులు, వ్యాపారులు మాత్రమే లాభపడుతున్నారు. కిలో సరుకు 50కి కొనుగులు చేస్తే.. వాటిని రూ.90-100 కి విక్రయిస్తున్నారు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి.

రాజాం రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి):

ఆషాడంలో కూరగాయల ధరలు కాస్త అటూఇటుగా ఉన్నా శ్రావణం రాకతో పైకి ఎగబాకుతున్నాయి. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో అల్లాడుతున్న ప్రజలకు కూరగాయల ధరలు 'మూలిగేనక్కపై తాటిపండు' అన్న చందంగా మారాయి. ఈ పెరిగిన ధరల ప్రతిఫలం రైతులకు ఏమ్రాతం దక్కడం లేదు. వినియోగదారులకూ దక్కడం లేదు. దళారులు, వ్యాపారులకు మాత్రం పంట పండుతోంది.

కిలో పచ్చిమిర్చి వంద పైనే..

నాలుగైదు రోజుల వరకూ కిలో టమాటా ధర రూ.30-40 మధ్య ఉండేది. గురువారం నాటికి కిలో (మిగతా 8వ పేజీలో..)



భూముల వివాదం కొలిక్కి వచ్చేనా?



ఎస్.కోట మండలంలో జిందాల్ యాజమాన్యానికి అప్పగించిన భూములు ఇవే

● పరిశ్రమల నిర్మాణాన్ని వ్యతిరేకించడం లేదు. నిర్వాసిత రైతుల సమస్యలను పరిష్కరించాలని అడుగుతున్నాం. అప్పట్లో పరిశ్రమల స్థాపనకే భూములు ఇచ్చాం. వారంతా నా మాట ప్రకారం భూములు ఇచ్చారు. తీసుకున్న భూములకు కేవలం ఎకరాకు రూ.రెండు లక్షల ఐదువందలు తప్ప మిగిలిన హామీలేవీ నెరవేర్చలేదు. జిందాల్ యాజమాన్యం అప్పుడు ఇచ్చిన మాట ప్రకారం నిర్వాసిత రైతుల సమస్యలను పరిష్కరించాలి.

- ఇందుకూరి రఘురాజు, ఎమ్మెల్సీ

- నిర్వాసితుల సమస్యలకు పరిష్కారం చూపాలంటున్న ఎమ్మెల్సీ
- అర్హులందరికీ న్యాయం చేస్తామంటున్న డీసీఎంఎస్ చైర్మన్
- రైతుల కోసమే ఎంఎస్ఎంఈ పార్కులను ఆపామంటున్న మాజీ ఎమ్మెల్యే
- జిందాల్‌కు అప్పగించిన భూముల చుట్టూ తిరుగుతున్న రాజకీయం

● అర్హత కలిగిన ప్రతి రైతుకూ న్యాయం జరుగుతుంది. నిర్వాసిత రైతుల సమస్యలకు పరిష్కారం పేరుతో పరిశ్రమలు రాకుండా అడ్డుకోవడం సరికాదు. ఘర్షణ వాతావరణం ఉండే ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టేందుకు ఎవరూ ముందుకు రారు. భూమి కోల్పోయిన ప్రతి ఒక్కరికీ పరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అర్హులను గుర్తించే బాధ్యతను కేఆర్‌సీసీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ మురళీకి అప్పగించారు.

- గొంప కృష్ణ, డీసీఎంఎస్ చైర్మన్

● ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణానికి 2023లో వైసీపీ ప్రభుత్వం జీవో ఇచ్చింది. తాటిపూడి రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా చేసేందుకు నిర్ణయం తీసుకుంది. అయితే నిర్వాసిత రైతులకు న్యాయం చేసిన తరువాతే పరిశ్రమలను ఏర్పాటు చేయాలని జిల్లాకు చెందిన అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణకు చెప్పాను. ఈ విషయం అప్పటి సీఎం దృష్టిలో పెట్టడంతో ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణానికి జరగాల్సిన శంకుస్థాపన అగింది.

- కడుబండి శ్రీనివాసరావు, మాజీఎమ్మెల్యే

శృంగవరపుకోట, జూలై 31 (ఆంధ్రజ్యోతి):

శృంగవరపుకోట మండలంలోని జేఎస్‌డబ్ల్యూ (జిందాల్) అల్యూమినియం కంపెనీ వద్ద ఉన్న భూముల విషయంలో నేతలు ఒక్కొక్కరూ ఒక్కో మాట చెబుతున్నారు. ఈ భూముల చుట్టే ఇప్పుడు రాజకీయం తిరుగుతోంది. ఓ పక్క పరిశ్రమలను ఏర్పాటు చేయాలంటూనే మరో పక్క భూనిర్వాసితుల సమస్యలను పరిష్కారించాలని పెడుతున్న మెలికతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగలేకపోతోంది. విశాఖ మహానగరానికి (మిగతా 8వ పేజీలో..)

నేటి నుంచే కొత్త పింఛన్లు

- జిల్లాలో 4,824 మంది వితంతువులకు ఊరట
- పంపిణీకి ఏర్పాట్లు పూర్తి



నియోజకవర్గం	కొత్త స్పౌజ్ పింఛన్లు
విజయనగరం	559
బొబ్బిలి	787
చీపురుపల్లి	604
గజపతినగరం	675
నెల్లిమర్ల	722
రాజాం	685
ఎస్ కోట	745
మెంటాడ	147
మొత్తం పెన్షన్లు	4,824

విజయనగరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2019 నుంచి వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న వితంతువులకు ఇకపై పింఛను అందనుంది. 4,824 వితంతు పెన్షన్‌లు కొత్తగా మంజూర య్యాయి. వీరందరూ ఈ నెల నుంచే కొత్త పింఛన్ అందుకోనున్నారు. 2019 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వితంతు పెన్షన్లను పట్టించుకోలేదు. దీంతో వారంతా చాలా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి పడరాని పాట్లు పడ్డారు. అయినా ఆ ప్రభుత్వం కనికరించలేదు. ఏడాది కిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు కొత్త పెన్షన్‌లను మంజూరు చేసింది. దాదాపు పెండింగ్‌లో వున్న దరఖాస్తుదారులందరికీ పరిష్కారం చూపింది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల (మిగతా 8వ పేజీలో..)



గిరిజనుల ఇంటిని తనిఖీ చేస్తున్న పోలీసులు

గిరిశిఖర గ్రామాల్లో కార్డెన్ సెర్చ్

- జల్లెడ పట్టిన 100 మంది పోలీసులు

ఎస్.కోట రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): బొడ్డవర, దారపర్తి పంచాయతీల పరిధిలోని గిరి శిఖర గ్రామాల్లో పోలీసులు గురువారం కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ఒక్కసారిగా వంద మంది పోలీసులు రావడంతో గిరిజనులు నిర్ఘాంతపోయారు. ఏం జరిగిందోనని టెన్షన్ పడ్డారు. వారు తనిఖీలు చేస్తున్నంత సేపూ ఆందోళనతో ఉన్నారు. ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు డీఎస్‌పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సీఐ నారాయణమూర్తి ఆధ్వర్యంలో 100మంది పోలీసులు గురువారం ఉదయం 10గంటల సమయంలో కార్డెన్ సెర్చ్‌కు దిగారు. వారంతా ఆటోల్లో కొండపైకి చేరుకున్నారు. అనంతరం ఒక్కో ఇంటి తలపు తట్టి లోపలకు ప్రవేశించి తనిఖీలు చేపట్టారు. ఎక్కడా ఏమి లభించలేదు. తనిఖీల విషయమై డీఎస్‌పీ విలేకరులతో మాట్లాడుతూ అనుమానిత వ్యక్తులు గిరిజనుల్లో ఉంటే ప్రమాదకరమని, నిషేధిత పరికరాలు ఉండకూడదని, వారి రక్షణ కోసమే తనిఖీలు చేపట్టామన్నారు. 16మంది ఎస్ఐల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ నిర్వహించారు.

విద్యార్థుల ఆటో బోల్తా

- ఆరుగురికి గాయాలు

7

జేఎస్ఎల్ కార్మికులకు న్యాయం చేయండి

- జాయింట్ లేబర్ కమిషనర్‌కు వినతి

స్త్రీశక్తికి గ్రీన్ సిగ్నల్!



- మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ పథకం పేరు మార్పు
- ఆగస్టు 15 నుంచి ప్రారంభం ● ఏర్పాట్లలో అధికారులు

విజయనగరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి):

ఆర్టీసీ బస్సులో మహిళల ఉచిత ప్రయాణ పథకానికి ప్రభుత్వం స్త్రీశక్తి పేరును తాజాగా ఖరారు చేసింది. ఈ నెల 15 నుంచే అమలు చేసే దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. అధికారులంతా ఏర్పాట్లలో తలమునకలయ్యారు. తాము అధికారంలోకి వస్తే ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ మేరకు పథకాన్ని పట్టాలెక్కించేందుకు పంద్రాగస్టును ముహూర్తంగా నిర్ణయించారు. ఇప్పటికే కొత్త బస్సుల విషయంపై అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కొత్త బస్సులు వచ్చేవరకూ పాత బస్సులతోనే పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

మహిళలకు పెద్దపీట..

మహిళలకు పెద్దపీట వేస్తూ ఎన్నికల్లో ఉచిత ప్రయాణ పథకాన్ని రూపొందించారు. సూపర్ సిక్స్ హామీల్లో చేర్చారు. ఇప్పుడు ఆచరణకు దిగుతున్నారు. ప్రభుత్వం పథకానికి స్త్రీశక్తిగా నామకరణం చేసింది. మరోవైపు జీరో ఫెయిర్ టిక్కెట్ ముద్రణకు సైతం ఏర్పాట్లు పూర్తయ్యా యని సమాచారం. ఆ టిక్కెట్‌పై స్త్రీశక్తి పేరు ఉంటుంది. అదే సమయంలో ఏ డిపోకు చెందిన బస్సు. ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణం వంటివి ఉంటాయి. ప్రభుత్వ (మిగతా 8వ పేజీలో..)

ఏర్పాట్లు చేస్తున్నాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నాం. మార్గదర్శకాలు రావాల్సి ఉంది. ఈ పథకానికి స్త్రీశక్తి పేరు పెట్టినట్లు తెలిసింది. ఇంకా అధికారిక ఉత్తర్వులు రాలేదు. ఇప్పటికే డిపోల వారీగా.. రూట్లవారీగా ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తాం. అవసరం అనుకుంటే అదనపు సర్వీసులను సైతం నడుపుతాం. బస్సులను ఫిట్‌గా ఉంచాలని ఉన్నాతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి.

- వరలక్ష్మి, ప్రజారవాణా అధికారి, విజయనగరం

రేపు 'అన్నదాత సుఖీభవ'

- కేంద్ర, రాష్ట్రం కలిపి రూ.7వేలు జమ
- జిల్లా వ్యాప్తంగా 2,19,503 మందికి రూ.148.35 కోట్ల లబ్ధి

విజయనగరం కలెక్టరేట్, జూలై 31(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా కూటమి ప్రభుత్వం అన్నదాతకు ఆర్థిక సాయం అందించేందుకు రంగం సిద్ధం చేసింది. అన్నదాత సుఖీభవ పథకం అమలుకు దాదాపు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలోని 2,19,503 మంది రైతులకు రూ.148.35 కోట్ల లబ్ధి చేకూరనుంది. ఈ నెల 2న రైతుల ఖాతాల్లో నిధులు జమ కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ నిధులను అదే రోజు విడుదల చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ పథకాన్ని కూడా ఆ రోజే జమ చేయాలని నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం రూ.2వేలు, రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభ పథకం కింద రూ.5 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు రైతుల ఖాతాలో పడనున్నాయి. అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలో 2,19,503 మంది రైతులకు రూ.5 వేలు చొప్పున రూ.107.75 కోట్లు, పీఎం కిసాన్ ద్వారా రూ.2 వేలు చొప్పున రూ.36.60 కోట్లు పంపిణీ చేయనున్నారు. జిల్లాలోని ప్రతి గ్రామ సచివాలయంలో ఆ రోజు గ్రామ సభ పెట్టి లబ్ధిదారులకు వివరించనున్నారు. నియోజకవర్గ స్థాయిలో జరగనున్న కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీ పాల్గొంటారు.

● అన్నదాత సుఖీభవ పథకంపై సీఎం చంద్రబాబు నాయుడు కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి రైతుకు పథకం అందేలా చూడాలని ఆదేశించారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్



తల్లి పాలే అమృతం

- బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం
- అమ్మకూ వ్యాధులు దూరం
- డబ్బా పాలకు దూరంగా ఉండడమే మేలు
- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

6

మన్యంలో ఎగిరొస్తున్న డ్రోన్లు



- పెరిగిన వినియోగం
- రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్, వైద్య శాఖల్లో కీలకం
- రానున్న రోజుల్లో మరింతగా పెరగనున్న సంఖ్య
- ఆపరేటర్లుగా యువతకు ఉపాధి అవకాశం

6

కూటమి ప్రభుత్వం వచ్చాకే అభివృద్ధి

- అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు

6

కురుపాం సమీపంలో ఏనుగుల గుంపు

తల్లిపాలే అమృతం



- బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం
- అమ్మకూ వ్యాధులు దూరం
- డబ్బా పాలకు దూరంగా ఉండడమే మేలు
- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

● రాజాంలోని ఓ పిల్లల ఆస్పత్రికి 8 నెలల బిడ్డను తెచ్చింది ఓ మహిళ. నిత్యం విరేచనాలు అవుతున్నాయని ఆమె చెప్పడంతో వైద్యులు పరిశీలించారు. తల్లిపాలు ఇవ్వడం లేదా అని ప్రశ్నించగా.. తాను ఉద్యోగం చేస్తుంటానని.. రోజుకు ఒకసారి మాత్రమే పాలు పెడుతుంటానని చెప్పారు. రోజంతా కుటుంబ సభ్యులే పోత పాలు పడుతుంటారని ఆ మహిళ చెప్పింది. దీంతో చిన్నారికి డయేరియాగా నిర్ధారించిన వైద్యులు విధిగా తల్లిపాలు ఇవ్వాలని కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

● ఇంకో మహిళ పుట్టిన నాటి నుంచి శిశువుకు డబ్బా పాలు పట్టింది. 3 నెలల తరువాత చూస్తే బిడ్డ ఎదుగుదలలో తేడా కనిపించింది. వెంటనే ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించారు. పుట్టిన సమయంలో 3 కిలోలు ఉన్న బిడ్డ.. 3 నెలల తరువాత కేవలం 3.5 కిలోలే ఉండడాన్ని గుర్తించారు. తల్లి రోజులో ఒకసారి మాత్రమే పాలిచ్చి..మిగతా పూటల్లో డబ్బా పాలు పట్టడం వల్లనే ఎదుగుదల లేదని నిర్ధారించారు. తల్లిపాల ఆవశ్యకత పై అవగాహన కల్పించి పంపించారు.



రాజాం, జూలై 31 (ఆంధ్రజ్యోతి)

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం. అంతకు మించి బాలింతకు ఆరోగ్యకరం. కానీ ఈ విషయం తెలియని చాలామంది బిడ్డలకు పాలివ్వకుండా వారి అనారోగ్యానికి కారణమవుతున్నారు. తాము సైతం రొమ్ము క్యాన్సర్‌తో పాటు రక్తపోటు, మధుమేహం వంటి వాటికి గురవుతున్నారు. పిల్లల ఎదుగుదలకు తల్లిపాలు శ్రేష్ఠమని వైద్య నిపుణులు చెబుతున్నారు. కానీ శరీర ఆకృతి మారిపోతుందని.. అందం, ఛాయ తగ్గిపోతుందని చాలా మంది బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడం మరుస్తున్నారు. ఇది చాలా ప్రమాదకరం. అందుకే తల్లిపాల ఆవశ్యకతను చాటిచెప్పేందుకు ఏటా ఆగస్టు 1 నుంచి వారం రోజుల పాటు వారోత్సవాలు నిర్వహిస్తుంటారు.

బిడ్డ పుట్టిన క్షణం నుంచే..

సహజ సిద్ధంగా లభించే తల్లిపాల బదులు డబ్బా పాలు పడుతుండడం పిల్లల భవితకే ముప్పుగా పరిణమిస్తోంది. తల్లి రోజుకు 600 మిల్లీలీటర్ల వరకూ పాలు ఇచ్చే అవకాశం ఉంటుంది. కనీసం 500 మిల్లీలీటర్ల పాలు ఇస్తే..ఇతరత్రా రూపాల్లో ఆహారం అందించాల్సిన అవసరం లేదు. బిడ్డ పుట్టిన వెంటనే పాలు ఇవ్వడం ప్రారంభించాలి. అలా రెండేళ్ల వయసు వరకూ ఇవ్వచ్చు. మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే ఇవ్వాలి. తద్వారా అస్తమా, ఎలర్జీ, ఇమ్యూనిటీ లోపం, టీబీ, బ్లడ్‌క్యాన్సర్, డయాబెటిస్, ఎదుగుదల లోపం వంటి రుగ్మతల నుంచి బిడ్డను కాపాడవచ్చు. నవజాత శిశువులకు తల్లిపాలు బదులు పోత పాలు పట్టడంతో వివిధ రుగ్మతల భారిన పడుతున్నారు. ఎదుగుదల లోపం, శ్వాస సంబంధ వ్యాధులు, అస్తమా వంటి వాటికి గురవుతున్నారు. ప్రాథమిక స్థాయిలో తల్లి పాలు ఇవ్వకపోతే ఆ చిన్నారికి జీవితాంతం చాలా రకాల రుగ్మతలు వెంటాడుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బిడ్డలకు తల్లిపాలు ఇస్తున్నారు. కానీ పట్టణ, నగర ప్రాంతాల్లో మాత్రం చిన్నారులకు తల్లిపాలు అందడం లేదు.

ప్రయోజనాలివే..

ఏ వయసుల వారైనా ఆహార పదార్థాలు ఎంత తాజాగా తీసుకుంటే.. అంత ఆరోగ్యంగా ఉంటారు. పిల్లలకైనా అదే వర్తిస్తుంది. తల్లిపాలు తాగడం వల్ల శిశువులు సురక్షితంగా, ఆరోగ్యంగా ఎదుగుతారు. బిడ్డకు జన్మనిచ్చిన నాలుగు రోజుల వరకూ తల్లి ఉత్పత్తి అయ్యే పాలను ముర్రుపాలు అంటారు. అవి పిల్లలకు ఎలాంటి అలర్జీలు, ఇన్‌ఫెక్షన్లు సోకకుండా కాపాడతాయి. ఈ పాలు పిల్లల జీర్ణవ్యవస్థకు ఎలాంటి హాని కలగకుండా రక్షిస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. తల్లిపాలు తాగి పెరిగిన పిల్లల మెదడు చురుగ్గా పనిచేస్తుందని వివిధ అధ్యయనాలు తేల్చాయి. పిల్లలు బాగా చదవాలన్నా.. భవిష్యత్‌లో అభివృద్ధి సాధించాలన్నా.. పుట్టిన పాపాయికి కొన్ని నెలల పాటు తల్లిపాలు తాగించడం ఎంతో శ్రేయస్కరం. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం. ఈ పాలలో విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్‌లు వంటి ఎన్నో పోషక గుణాలు ఉంటాయి. పాపాయి శరీరానికి అవసరమైన కొవ్వును కూడా అందిస్తాయి. ఇవన్నీ బిడ్డ ఆరోగ్యంగా ఎదిగేందుకు దోహదపడతాయి. తల్లిపాలు సులభంగా జీర్ణం కావడంతో మలబద్ధకం, జీర్ణ సంబంధిత సమస్యలు ఎదురుకాకుండా ఉంటాయి. ఎదిగే బిడ్డ వయసుకు తగ్గట్టు బరువును ఉంచడంలో కూడా తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయి.

తల్లికీ ఎంతో మేలు..

తల్లి పాలు తాగడం వల్ల పాపాయికే కాదు.. తల్లికి కూడా ఎంతో ఆరోగ్యకరం. దీని వల్ల ఆక్సిటోసిన్ అనే హార్మోన్ విడుదల అవుతుంది. ఇది పాలు పడడానికే కాకుండా గర్భాశయం త్వరగా సంకోచించేందుకు కూడా దోహదపడుతుంది. దీంతో కాన్పు తరువాత రక్తస్రావమూ తగ్గుతుంది. మాతృ మరణాల్లో ఎక్కువగా రక్తస్రావం ఆగకపోవడమే ప్రధాన కారణంగా నిపుణులు చెబుతారు. కాన్పు తరువాత ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు వంటివి పిల్లలకు పాలివ్వడం ద్వారా పూర్తిగా తగ్గుతాయి. బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా గర్భిణిగా ఉండే సమయంలో పెరిగిన బరువు కూడా తగ్గుతుంది. పాలిచ్చే క్రమంలో తల్లి శరీరంలో ఉండే క్యాలరీలు ఎక్కువగా ఖర్చవుతాయి. తద్వారా చాలా సులువుగా బరువు తగ్గవచ్చు. పాలు పట్టడం వల్ల తల్లికి మధుమేహం, అధిక రక్తపోటు వంటి వాటి బారినపడే అవకాశం ఉండదని నిపుణులు చెబుతున్నారు. బిడ్డకు పాలిచ్చే మహిళలకు గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ ముప్పు చాలా తక్కువని నిపుణులు చెబుతున్నారు. అన్నింటికీ మించి తల్లిపాలు ఇవ్వడం ద్వారా.. పిల్లలకు, తల్లులకు మధ్య అనుబంధం పెరుగుతుంది. అందుకే సమాజంలో ప్రతిఒక్కరూ తల్లిపాల ఆవశ్యకత తెలుసుకొని అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది.

అవగాహన కల్పిస్తాం..

తల్లి పాలు సురక్షితం, ఎంతో శ్రేయస్కరం. అందుకే తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి సమాజంలో అవగాహన పెంచే ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 2,206 ప్రధాన కేంద్రాలు కాగా.. మినీ కేంద్రాలు 293 ఉన్నాయి. వీటి పరిధిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి.

-విమలారాణి, ఐసీడీఎస్ పీడీ, విజయనగరం

తల్లిపాలే ఇవ్వాలి..

పుట్టిన నాటి నుంచి పిల్లలకు తల్లి పాలు ఇవ్వడం ప్రారంభించాలి. వారిలో ఎటువంటి రుగ్మతలు దరిచేరకుండా తల్లిపాలు రక్షణ కవచంలా పనిచేస్తాయి. పోత పాలు, డబ్బా పాలు పట్టకుండా ఉండాలి. అలా చేస్తున్న వారు తమ పిల్లల ను అనారోగ్యంలోకి నెడుతున్నారన్న విషయాన్ని గ్రహించాలి. తల్లి పాలు పడితే శరీర ఆకృతి దెబ్బతింటుందన్నది వారి భ్రమ. పాలు పట్టించడం పాపాయితో పాటు తల్లి ఆరోగ్యానికి కూడా ఎంతో శ్రేయస్కరం.

-నీరజ, గైనకాలజిస్టు, రాజాం



ఇంజన్లు పెట్టి పొలాలను తడుపుతున్న రైతులు



ఎండ వేడికి పగుళ్లు ఏర్పడిన పొలాలు

వరుణుడు కరుణించక.. తోటపల్లి నీరందక

- ఇంజన్ల సాయంతో పంటను కాపాడుకుంటున్న అన్నదాతలు

పాలకొండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వరుణుడు పెడముఖం పెట్టడంతో నాట్లు వేసిన పొలాలు ఎండకు పగుళ్లు బారడంతో అవకాశం ఉన్న చోట పాలకొండ ప్రాంతంలో రైతులు ఇంజన్లు పెట్టుకుని పంటను కాపాడుకుంటున్నారన్నారు. జూలై 16న తోటపల్లి ప్రాజెక్టు నుంచి సాగునీరు విడిచిపెట్టామని, సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని జలవనరులశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ పాలకొండ పరిధిలో శివారు ఆయకట్టు భూములకు సాగునీరు అందడంలేదు. షట్టర్లు ఏర్పాటు చేయాలని, లస్కర్లను నియమించాలని పలుమార్లు కలెక్టర్, పాలకొండ సబ్ కలెక్టర్, ఇరిగేషన్ అధికారులను కోరినా ఫలితం లేదని రైతులు అంటున్నారు.

మన్యంలో ఎగిరొస్తున్న డ్రోన్లు

- ప్రభుత్వ చొరవతో జిల్లాలో పెరిగిన వినియోగం
- రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్, వైద్య, ఆరోగ్య శాఖల్లో కీలకం
- రానున్న రోజుల్లో పెరగనున్న వాటి సంఖ్య
- ఆపరేటర్లుగా యువతకు ఉపాధి అవకాశం

గుమ్మలక్ష్మీపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ చొరవతో జిల్లాలో డ్రోన్ల వినియోగం పెరిగింది. ప్రధానంగా పోలీస్, వ్యవసాయ, వైద్య, ఆరోగ్య, రెవెన్యూ, అటవీ శాఖల్లో దానిని విరివిగా వినియోగిస్తున్నారు. వివిధ రకాల పంటలపై క్రిమి సంహారక మందుల పిచికారీ, చెరువుల్లో దోమల లార్వా నివారణ, భూముల రీసర్వే ప్రక్రియ తదితర వాటిని డ్రోన్లతోనే చేపడుతున్నారు. దీనివల్ల తక్కువ వ్యయంతో త్వరగా పనులు పూర్తవుతుండడంతో రానున్న రోజుల్లో డ్రోన్ల వినియోగం మరింత పెరగనుందనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వాటి నిర్వహణ, మరమ్మతులు చేపట్టేందుకు ఆపరేటర్లుగా పలువురికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పరిశీలకులు భావిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

● జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు డ్రోన్లు చేరువవుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ శాఖల్లో వాటి వినియోగం పెరగడంతో అతి తక్కువ సమయంలోనే త్వరగా పనులు పూర్తవుతున్నాయి. మన్యంలో వ్యవసాయశాఖకు ప్రభుత్వం 9 డ్రోన్లు అందించగా.. పలుచోట్ల హైరింగ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేశారు. అవసరం ఉన్న రైతులు ఈ హైరింగ్ సెంటర్లకు వెళ్లి డ్రోన్ తీసుకోవచ్చు. పంట పొలాల్లో క్రిమిసంహారక మందులు పిచికారీ చేసుకోవచ్చు. ఈ హైరింగ్ సెంటర్‌లో నిర్వహించే రైతులకు ప్రభుత్వ రాయితీతో రూ.మూడు లక్షల వరకు వ్యవసాయశాఖ రుణ సదుపాయం కల్పిస్తోంది.

● వైద్య ఆరోగ్యశాఖకు ప్రభుత్వం రెండు డ్రోన్లు అందించింది. వాటితో యాంటీ లార్వల్ ఆపరేషన్ చేపడుతున్నారు. నీటి గుంటలు, చెరువుల్లో దోమలు లార్వా నివారణకు డ్రోన్ల ద్వారా క్రిమి సంహారక మందుల పిచికారీ చేస్తున్నారు. కాగా డ్రోన్ల సాయంతో మలేరియా నివారణ చర్యలు చేపడుతున్నట్లు డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు.

● శాంతి భద్రతల పరిరక్షణలోనూ డ్రోన్లు కీలకంగా మారాయి. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారు, అసాంఘిక కార్యకలాపాలు చేపట్టే వారిని గుర్తించేందుకు పోలీస్‌లు డ్రోన్‌లను వినియోగిస్తున్నారు. బహిరంగ సభలు, వివిధ కార్యక్రమాలు, ర్యాలీలు, ధర్నాలు, నిరసనల సమయంలోనూ వాటిని వాడుతున్నారు. వాటి వల్ల నేరస్థులను గుర్తించడం సులభమైందని పోలీస్ వర్గాలు చెబుతున్నాయి.

● రెవెన్యూ శాఖ అధికారులు నిర్వహించే భూముల రీ సర్వేకు కూడా డ్రోన్లు తప్పనిసరి అయ్యాయి. వాటి ద్వారానే సర్వేయర్లు భూ సరిహద్దులను గుర్తిస్తున్నారు. భవిష్యత్‌లో తుపాన్లు, వరదలు, ఇతరత్రా విపత్తుల సమయాల్లోనూ డ్రోన్లను వినియోగించనున్నట్లు సంబంధిత అధికారులు తెలియజేస్తున్నారు.

● అటవీశాఖ అధికారులు సైతం రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో డ్రోన్ల సాయంతో విత్తనాలు జల్లుతున్నారు.



డ్రోన్ సహాయంతో చేపట్టిన యాంటీలార్వల్ ఆపరేషన్‌ను పరిశీలిస్తున్న పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

యాంటీ లార్వల్ ఆపరేషన్ పరిశీలన..

సీతంపేట రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో మురుగునీటి నిల్వలు ఉండే ప్రాంతాల్లో గురువారం డ్రోన్ సహాయంతో యాంటీ లార్వల్ ఆపరేషన్‌ను నిర్వహించారు. పెద్దూరు, నౌగూడ పరిసరాల్లోని పెద్ద చెరువుల్లో దోమ పిల్లలను నాశనం చేసేందుకు మలేరియా సిబ్బంది యాంటీలార్వల్ ఆపరేషన్ చేపట్టారు. ఆ ఆపరేషన్‌ను ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఆపరేషన్ నిర్వహణ తీరును డీఎంవో పీవీ సత్యనారాయణ అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్‌లో డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి, మలేరియా సబ్‌యూనిట్ అధికారి జె.మోహనరావు తదితరులున్నారు.



డ్రోన్ల వాడకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)

గాయత్రీదేవికి గాజులతో అలంకరణ

రాజాం రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): భక్తులు సమర్పించిన వందలాది రంగురంగుల గాజులతో గాయత్రీ వేదమాతను గురువారం సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వివేకానందరావు, ప్రధాన అర్చకులు వాసా జగదీశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.



గాజుల అలంకరణలో గాయత్రీదేవి

19 జలవనరులకు రూ 24.6 కోట్లతో ప్రతిపాదనలు

- కలెక్టర్ అంబేద్కర్

విజయనగరం కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 19 జలవనరులకు మరమ్మతులు చేయనున్నట్టు కలెక్టర్ అంబేద్కర్ తెలిపారు. గురువారం తన చాంబర్‌లో జలవనరుల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంకేఎస్‌వై ఆర్‌ఆర్‌ఆర్ పథకంలో జిల్లాలోని 6,673 ఎకరాల ఆయకట్టుకు నీరందించడానికి రూ.24.6 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినట్టు తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపీ అధ్యక్షతన జరిగే సమావేశంలో అనుమతి తీసుకుని ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఈ స్వర్ణకుమార్, తోటపల్లి ఈఈ అప్పలనాయుడు, రెగ్యులర్ ఈఈ ఎంవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు

కూటమి ప్రభుత్వం వచ్చాకే అభివృద్ధి

- అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు

రామభద్రపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తోందని మాజీ మంత్రి, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు అన్నారు. బూసాయవలస గ్రామంలో గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్థిక పరిస్థితి బాగోలేనప్పటికీ రాష్ట్రం కోసం సీఎం చంద్రబాబు ఎంతో కష్టపడుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలపడానికి పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని కొనియాడారు. పేదరిక నిర్మూలకు ఈ పథకం ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. ఇప్పటికే రైతుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు రూపొందిస్తున్నారని, అలాగే తల్లికి వందనం ద్వారా ప్రతీ విద్యార్థికి రూ.15 వేలు ఇస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి కూడా పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్నిరంగాల్లో వెనుకబడిపోయిందని, కోట్లాది రూపాయలు అవినీతి జరిగిందని ఆరోపించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు, టీడీపీ బీసీ సంక్షేమం జిల్లా ఉపాధ్యక్షుడు కర్రోతు తిరుపతిరావు, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ గంట సాయి తదితరులు పాల్గొన్నారు.

కురుపాం సమీపంలో ఏనుగుల గుంపు

కురుపాం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కురుపాం సమీపంలో గురువారం రాత్రి రోడ్డుపై సంచరించడంతో వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. రెండు రోజులుగా కురుపాం సమీపంలో గల సీతంపేట, బియ్యాలవలస సమీపంలో సంచరించిన ఏనుగులు కురుపాం సమీపంలో గల ఎస్‌టీఎం వద్ద నుంచి గుమ్మలక్ష్మీపురం వెళ్లే రోడ్డుపై గుంపుగా పెళ్లివలస వైపు వెళ్తున్నాయి. దీంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు.



రాత్రి రోడ్డుపై నడుస్తున్న ఏనుగుల గుంపు

న్యూస్ బాక్స్

'సర్టిఫికేషన్ కోర్స్' పోస్టర్ విడుదల

విజయనగరం రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి సర్టిఫికేషన్ కోర్సు ఇంజనీరింగ్ టెక్నాలజీస్ అనే అంశంపై గురువారం ఆన్‌లైన్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సులపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, కోఆర్డినేటర్ హేమ పాల్గొన్నారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

భోగాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): భోగాపురం ఐసీడీఎస్ కార్యాలయ పరిధిలోగల అంగన్‌వాడీ కేంద్రల్లో శుక్రవారం నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్టు సీడీపీఎ లావణ్య గురువారం తెలిపారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలకు, గర్భిణులకు తల్లి పాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తామని చెప్పారు.

అన్ని రంగాల్లో రాణించాలి

రాజాం, జూలై 31, (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు పేర్కొన్నారు. రేషన్ డీలర్ల రాష్ట్ర అసోసియేషన్‌లో చోటుదక్కిన అంత కాపల్లి డీలర్ వాకముల్ల జ్యోత్నాదేవి, పట్టణం లోని రాణా వీధి డిపో డీలరు లలితకుమారిలను గురువారం తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజాం డీలర్స్ అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మంచి ఫలితాలకు కృషి

వంగర, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు సిబ్బంది కృషి చేయాలని డీఐఈవో సువ్వాల తవిటినాయుడు సూచించారు. గురువారం ఆయన మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన అవసరం

రేగిడి, జూలై 31, (ఆంధ్రజ్యోతి): సర్కారు బడుల్లో నాణ్యమైన బోధన లక్ష్యం కావాలని ఎంఈవో వరప్రసాదరావు ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. లచ్చరాయపురం ఎంపీఈ పాఠశాలను గురువారం ఎంఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా సర్కారు బడులు పని చేయాలని సూచించారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

భోగాపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): తూడెం పంచాయతీలో నిధులు దుర్వినియోగం చేశారంటూ అందిన ఫిర్యాదుపై డిప్యూటీ ఎంపీడీవో గాయత్రి గురువారం విచారణ చేపట్టారు. స్థానిక సర్పంచ్ 2021-2025 మధ్య నిధులు దుర్వినియోగం చేశారంటూ రీసు రమణ కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఈ ఏడాది మే 17న ఫిర్యాదు చేశారు. విచారణ నివేదికను డీపీవోకు అందజే యనున్నారు.

పరిశుభ్రంగా ఉంచండి

వేపాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈవో పి.బాలభాస్కరరావు ఆదేశించారు. చామలాపల్లి, దబ్బిరాజుపేట గ్రామాల పాఠశాలలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఫేకర్ సమస్యలను పరిష్కరించండి

గరివిడి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గరివిడిలోని ఫేకర్ పరిశ్రమ సమస్యలను పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు. గత 30 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. గరివిడి ప్రాంతానికి కొత్తగా పరిశ్రమలు రాకపోగా... ఉన్నవి నడవకపోవడం వల్ల నిరుద్యోగ సమస్య పెరుగుతుందన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు.

ఆటో కార్మికుల సమస్యలు..

విజయనగరం గంటస్తంభం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని ఆటో కార్మిక సంఘాల నాయకులు నీలాపు అప్పలరాజురెడ్డి, రెడ్డి నారాయణరావులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఐడీఎంఎస్ కాంప్లెక్స్ సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వాహన మిత్ర కిందరూ రూ.15 వేలు ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. కానీ రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర రూ.10 వేలు వేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దీంతో పాటు మరికొన్ని సమస్యలను పరిష్కరించాలని కోరారు.

జేఎస్ఎల్ కార్మికులకు న్యాయం చేయండి

కొత్తవలస, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అప్పన్నపాలెం పంచాయతీ జిందాల్ నగర్‌లో ఉన్న జేఎస్ఎల్ కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికులకు న్యాయం చేయాలని టీఎన్‌టీయూసీ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు లెంక శ్రీను ఆధ్వర్యంలో కార్మికులు, యాజమాన్య ప్రతినిధులను, జాయింట్ లేబర్ కమిషనర్‌ను కలసి వినతిపత్రాలు అందజేశారు. ముందుగా కర్మాగారానికి వెళ్లి యాజమాన్య ప్రతినిధులు దినేష్ శర్మ, గోపాల కృష్ణను కలిశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికులకే ఎప్పుడూ అన్యాయం జరుగుతోందని, లాకౌట్ ఉన్నంత కాలం లే ఆఫ్ ఇవ్వాలని కోరారు. వీలైనంత త్వరగా కర్మాగారంలో లాకౌట్‌ను ఎత్తి వేసి న్యాయం చేయాలని కోరారు. అనంతరం విజయనగరంలోని జాయింట్ లేబర్ కమిషనర్‌ను కలసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈనెల 5న యాజమాన్యం, కార్మిక సంఘాలతో చర్చలను నిర్వహిస్తానని హామీ ఇచ్చారని లెంక శ్రీను తెలిపారు. 7,8 తేదీలలో తానే స్వయంగా కర్మాగారానికి వస్తానని చెప్పారని వివరించారు.


జేఎస్ఎల్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

గురుకులంలో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

వేపాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) బక్కునాయుడుపేట అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మిగులు సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జయశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సీట్ల భర్తీకి ఈ నెల 4న (సోమవారం) పాఠశాలలో స్పాట్ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 5వ తరగతిలో 45 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 6లో 7సీట్లు, 7లో 10, 8లో 6, 9లో 19, 10వ తరగతిలో 18 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 8, రెండో సంవత్సరంలో 5 సీట్లు ఖాళీ ఉన్నట్టు తెలిపారు. వివరాలకు 9542339722, 9491331681, 9603033948 నెంబర్లలో సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ జయశ్రీ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశాఖ-అరుకు రోడ్డులో ఆక్రమణల తొలగింపు కార్యక్రమం గురువారం ప్రశాంతంగా ముగిసింది. తహశీల్దార్ శ్రీనువాసరావు, ఎంపీడీవో సతీష్, పంచాయతీ కార్యదర్శి అనురాధ ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు మధ్య ఆక్రమణలు తొలగించారు. ఆక్రమణదారులే అధికశాతం తమ నిర్మాణాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ధర్నా చేస్తున్న కార్మికులు

విజయనగరం బాబామెట్ట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామేశ్, రంగరాజులు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నగరపాలక సంస్థ ఎదుట గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా పనిచేసి 15 మంది పదవీ విరమణ పొందారని, వారి కుటుంబాల్లో ఒక్కొక్కరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు, పర్మినెంట్ ఉద్యోగులకు పండుగ సెలవులు అమలు చేయాలన్నారు. కార్మికులకు పనిముట్లు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి

భోగాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన వారికి మెరుగైన సేవలం దించాలని జిల్లా రిజిస్ట్రార్ టి.ఉపేంద్ర సిబ్బందికి సూచిం చారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. రికార్డులు, రిజిస్ట్రేషన్ల తీరును పరిశీలించారు. సబ్ రిజిస్ట్రార్ రామకృష్ణతో వివిధ విషయాలపై చర్చించారు.


రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌వో

గిరిజన విద్యార్థులపై చిన్నచూపు తగదు


గిరిజన విద్యార్థులతో విజయగౌరి

మెంటాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రెడ్డివానివలస గిరిజన గ్రామంలో శాశ్వత పాఠశాల భవనం ఏర్పాటులో ప్రభుత్వాల అలసత్వం క్షమార్హం కాదని యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు విజయగౌరి అన్నారు. గిరిజన విద్యార్థులపై చిన్నచూపు తగదన్నారు. గురువారం ఆమె ఆ గ్రామాన్ని సందర్శించి సుమారు ఇరవయ్యేళ్లుగా ఓ ఇంటిలో నడుస్తున్న పాఠశాల దుస్థితిని స్వయంగా పరిశీలించారు. 28 మంది విద్యార్థులు బడి కావాలని అడుగుతుంటే బాధగా అనిపించిందన్నారు. విద్యార్థుల సృజనాత్మకత, విజ్ఞానం వారికి కల్పించే మౌలిక వసతులపై ఆధారపడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకులు శిరీష తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ గ్రామస్థులు ఆమెకు వినతిపత్రం అందజేశారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ


కిట్లను అందజేస్తున్న దృశ్యం

రాజాం రూరల్/రాజాం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌లో గురువారం 20 మంది గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు కిరణ్ మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనబరచాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గట్టి పాపారావు, వసంతరావు, సభ్యులు ఆకిరి రామారావు, కొల్లా కృష్ణారావు, మక్క అప్పలనాయుడు, కిశోర్, శ్రీను, జయదేవ్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

భోగాపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి):చేపలకంచేరు, బైరెడ్డిపాలెం పంచాయతీల్లో గురువారం డిప్యూటీ ఎంపీడీవో గాయత్రి ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ నెల 30న 'ఆంధ్రజ్యోతి'లో 'ఎటు చూసినా మురుగు' శీర్షికన వెలువడిన కథనంపై అధికారులు స్పందించారు. డిప్యూటీ ఎంపీడీవో సమక్షంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు ఎన్.సాంబమూర్తిరాజు, జి.హృదయ ప్రభాకర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు



మాట్లాడుతున్న ఆర్డీవో ఆశయ్య

గరివిడి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు బానిసలై యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని చీపురుపల్లి ఆర్డీవో పి.ఆశయ్య అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో గురువారం డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్డీవో మాట్లాడుతూ ఇటీవల కాలంలో యువత ఖైనీ, గుట్కా, గంజాయి లాంటి వాటికి అలవాటు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారికి భవిష్యత్తు ఉండదన్నారు. తల్లిదండ్రులు ఎన్నో వ్యయప్రయాసలతో చదివిస్తున్నారని, దానిని విద్యార్థులు గ్రహించి, మంచి మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు, తహసీల్దార్ బంగార్రాజు, ఎస్ఐ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబ ఆలయానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్నదృశ్యం

విజయనగరం కల్చరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు పైడిమాంబ ఆలయానికి గురువారం రూ.లక్ష విరాళం అందజేశారు. నగరంలోని దాసన్నపేట ప్రాంతానికి చెందిన దూసి సీతారామ ఈ మొత్తాన్ని ఆలయ అధికారులకు అందించారు. పైడిమాంబ దేవస్థానంలో నిత్యాన్నదానానికి ఈ నిధులు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఇదిలా ఉండగా శ్రావణమాసం గురువారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

స్మార్ట్‌మీటర్లను రద్దు చేయండి


మాట్లాడుతున్న లక్ష్మి

దత్తిరాజేరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కోమటిపల్లి జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు బద్దలుగొట్టండని ఎన్నికల ముందు పిలుపునిచ్చారని... ఇప్పుడు వైసీపీ బాటలోనే నేతలు పయనిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డి.గౌరీష్, ఎం.గౌరినాయుడు, ఎం.సతీష్, నాగరాజు, బి.అప్పలనాయుడు, ఎల్.రాము పాల్గొన్నారు.

పోస్టాఫీసు నిర్మాణం వైపు అడుగులు


స్థలంలో కొలతలు వేస్తున్న దృశ్యం

భోగాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): భోగాపురం మండల కార్యాలయాల కూడలిలో పోస్టాఫీసుకు అవసరమైన స్థలాన్ని రెవెన్యూ అధికారులు గురువారం పోస్టల్ శాఖ అధికారులకు అప్పగించారు. అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం రావడంతో ఇక్కడ పోస్టాఫీసు సేవలు పెరగనున్నాయి. దానికి అనుగుణంగా భవనానిన నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో 10 సెంట్ల స్థలం కేటాయిస్తున్నారు. దీని నిర్మాణానికి రూ.50లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో స్థలాన్ని రెవెన్యూ అధికారులు గురువారం అప్పగించారు. ఈ కార్యక్రమంలో తపాలాశాఖ జిల్లా సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు, ఏఎస్పీ కె.సుందరనాయుడు, ఎస్పీఎం టి.వి.రమణ, సిబ్బంది సీహెచ్ సుజాత, సర్వేయర్ మధుకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయింపుపై చర్చ

బైరెడ్డిపాలెంలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు స్థల పరిశీలనపై తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు చర్చించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంలో భాగంగా బైరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలను తొలగించనున్నారు. రెవెన్యూ అధికారులు స్థలం అప్పగిస్తే త్వరగా పాఠశాల భవనం నిర్మాణం చేపట్టనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రమణమ్మ, ఎంఈవో రమణమూర్తి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ధర్నాను విజయవంతం చేయండి

విజయనగరం రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం కలెక్టరేట్ వద్ద చేపట్ట నున్న ధర్నాను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ప్యాపిటో చైర్మన్ బి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం ప్యాపిటో కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయులకు రెండు నెలల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పొజిషన్ ఐడీలు, సాంకేతిక నిబంధనలు పెట్టి రెండు నెలల జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాపిటో ప్రతినిధులు ఈశ్వరరావు, జోగారావు, సూరిబాబు, పైడిరాజు, రమణ, నగేష్, అప్పారావు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

విద్యార్థుల ఆటో బోల్తా

ఆరుగురు చిన్నారులకు గాయాలు


చికిత్స పొందుతున్న విద్యార్థిని

కొత్తవలస, జూలై 31(ఆంధ్రజ్యోతి):అర్దానపాలెం సమీపంలో ఉన్న మోడల్ స్కూల్ విద్యార్థులతో వెళుతున్న ఆటో గురువారం సాయంత్రం బోల్తా పడింది. పాఠశాల నుంచి పిల్లలను ఇళ్లకు తీసుకెళుతున్న సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. అర్దానపాలెం సమీపంలో చోటుచేసుకున్న ఈ సంఘటనలో ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో మంగళపాలెం, కొత్తవలసకు చెందిన డి.శిరీష, ఎల్.సౌమ్యచంద్రిక, కె.మహేంద్ర, డి.యామిని, ఎస్.ఎస్.శ్రావణ్ కుమార్ మరో విద్యార్థి గాయపడ్డారు. క్షతగాత్రులకు కొత్తవలసలో ప్రాథమిక చికిత్స చేశారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు విద్యార్థులను విశాఖపట్నం తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు మంగళపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఆనంద్‌ను అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు స్థానిక కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ షణ్ముఖరావు తెలిపారు.

బండ్రసింగి ఘాట్ రోడ్డులో..


ఎల్లం (ఫైల్)

భామిని/ కురుపాం రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బండ్రసింగి ఘాట్ రోడ్డులో గురువారం ఉదయం ఆటో బోల్తా పడింది. ఘటనా స్థలంలోనే కురుపాం మండలం ఆవిటికి చెందిన కొండగొర్రె ఎల్లం (60) మృతి చెందారు. ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను భామిని పీహెచ్‌సీకి తరలించారు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ రాంబాబు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంపై ఆరా తీశారు. బత్తిలి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు గురువారం భామిని వారపు సంతకు కురుపాం మండలం ఆవిటి గ్రామానికి చెందిన ఏడుగురు ఘాట్ రోడ్డులో ఆటోలో ప్రయాణిస్తుండగా అదుపు తప్పి ఆటో బోల్తా పడి లోయలోకి దూసుకెళ్లింది. బోల్తాపడిన వెంటనే ఆటోలో ఉన్న ప్రయాణికులు చెల్లాచెదురయ్యారు. కొండగొర్రె ఎల్లం ఘటనా స్థలంలో తుదిశ్వాస విడిచాడు. క్షతగాత్రులకు భామిని పీహెచ్‌సీలో ప్రథమచికిత్స అనంతరం కొండగొర్రె గంగారావు, నాగేష్, మమంతీలకు ఐటీడీఏ అంబులెన్స్‌లో సీతంపేట తరలించారు. ఎల్లం భార్య తుని ఇచ్చిన ఫిర్యాదు మేరకు బత్తిలి ఎస్ఐ జి.అప్పారావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు.


లోయలో పడిన ఆటో

రేగిడిలో..

రేగిడి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాగితాపల్లి మలుపువద్ద బుధవారం రాత్రి ఆటో, లారీ ఢీకొన్న ఘటనలో ఆటో బోల్తా పడింది. మెరకముడిదాం మండలం సిరిదేవిపేటకు చెందిన పిల్లా సన్యాసమ్మ, పిల్లా తిరుపతి, కోరాడ సీత, దేవరాజు లక్ష్మికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నీలావతి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మెరకముడిదాం మండలం సిరిదేవిపేటకు చెందిన పిల్లా సన్యాసమ్మ, తిరుపతి మరి కొంతమంది బలిజపేట మండలం గలావల్లి నుంచి స్వగ్రామానికి ఆటోలో బయలుదేరారు. రేగిడి మండలం కాగితాపల్లి మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో బోల్తాపడింది. ఇందులో ప్రయాణిస్తున్న సన్యాసమ్మ, తిరుపతి, కోరాడ సీతలు తీవ్రంగా.. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో రాజాం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బంగారం చోరీపై దర్యాప్తు ముమ్మరం

వంగర, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బాగెమ్మపేటలో బంగారం చోరీ చేసి..మళ్లీ వాహనంలో పెట్టిన సంగతి తెలిసిందే. దొంగలు ఫోన్ చేసిన నెంబర్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఫోన్ కాల్ డేటా సేకరించామని, త్వరలో దొంగలను గుర్తిస్తామని ఎస్ఐ షేక్‌శంకర్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

గజపతినగరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): రామన్నపేట గ్రామానికి చెందిన కొండ్రోతు సూర్యనారాయణ ఇంటి నుంచి బయటకు వెళ్లి వారం రోజులైనా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు గురువారం తెలిపారు. సూర్యనారాయణ ఈనెల 24న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. ఆయన కుమారుడు యోహాన్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై చైతన్యం

రాజాం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వికాస తరంగిణి రాజంశాఖ అధ్వర్యంలో గురువారం అమ్మవారి కాలనీ, ఆదర్శనగర్, నవ్యానగర్ ప్రాంతవాసులకు పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై చైతన్యం కలిగించారు. ఈ కార్యక్రమంలో విజయగోవింద రామ ఆశ్రమం అధ్యక్షులు రమణమూర్తి, బాక్సర్ల పైడిరాజు. పెంకి చైతన్యకుమార్, వెంకట్ నాయుడు, శ్రీహరినాయుడు, జి.అప్పలనాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ శిక్షణ కేంద్రం పరిశీలన

లక్కవరపుకోట, జూలై 31(ఆంధ్రజ్యోతి): జమ్మాదేవిపేట వద్దగల ఎంఎస్ఎంఈ శిక్షణ కేంద్రాన్ని జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ఎంవి.కరుణాకర్ గురువారం పరిశీలించారు. గోల్డ్ స్టార్ కూడలికి దగ్గర్లో శిక్షణ పొందుతున్న వారిని కలిశారు. 24 మంది చిరువ్యాపారులు ఇక్కడ శిక్షణ పొందుతున్నట్లు సమన్వయకర్త డి.డానియల్ తెలిపారు.

పారిశుధ్య నిర్వహణలో అశ్రద్ధ వద్దు

విజయనగరం టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య నిర్వహణలో అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లె నల్లనయ్య హెచ్చరించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం ఉదయం పర్యటించిన ఆయన కాలువల పరిశుభ్రత, పారిశుధ్యం తీరును పరిశీలించారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు.

సంకిలిలో ముమ్మరంగా పనులు

రేగిడి, జూలై 31, (ఆంధ్రజ్యోతి): సంకిలి పంచాయతీలో నీటి వనరుల పరిశుభ్రత, పారిశుధ్య చర్యలు చేపడుతున్నారు. వర్షాకాలం కావడం.. గ్రామంలో అక్కడక్కడా జ్వరాలు ప్రబలుతుండటంతో పారిశుధ్య చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ పట్టాభి తెలిపారు.

భూముల కొనుగోలుతో మోసపోవద్దు

ఎస్.కోట రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిందాల్ పరిశ్రమ ఏర్పాటుతో తమ భూములు ఇచ్చి మోసపోయామని.. పరిశ్రమల ఏర్పాటుకు జిందాల్ వద్ద కొనుగోలు చేసి మోసపోవద్దని బాధితులు నినాదాలు చేశారు. గురువారం మధ్యాహ్నం బొడ్డవర గ్రామం వద్ద సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో వీరు నిరసన చేపట్టారు.

వారికి పన్నీరు.. వీరికి కన్నీరు

(ఐదో పేజీ తరువాయి)

రూ.60కి చేరింది. వారం క్రితం పచ్చిమిర్చి కిలో రూ.80లోపు ఉండగా.. ఇప్పుడు సెంచరీ దాటింది. పావు కిలో తీసుకుంటే రూ.40 ఇవ్వాల్సిందే. అల్లం కిలో రూ.300 కాగా వెల్లుల్లి మాత్రం కిలో రూ.200 వద్ద స్థిరంగా ఉంది. కిలో ఉల్లిధర చిన్నవి రూ.40 కాగా.. కాస్త పెద్దవి రూ.50 పలుకుతున్నాయి. గతవారం వీటి ధరలు రూ.30 నుంచి రూ.40 ఉండేది. బల్లచిక్కుడు కాయలు కిలో రూ.80 కాగా పొడవు చిక్కుళ్లు కిలో రూ.60 పలుకుతోంది. బీరకాయలు కిలో రూ.80 కాగా, బెండ, దొండ కాయలు కిలో రూ.60 నుంచి రూ.70కి చేరాయి. రెండు అరటికాయలు రూ.25 కాగా నాటు అంగాకరకాయలు కిలో రూ.180 పలుకుతోంది. హైబ్రిడ్ అంగాకరకాయలు ధర కిలో రూ.120కి చేరింది. కేబేజీ బుట్ట కిలో రూ.60 కాగా, వంకాయలు, బెండకాయలు కిలో రూ.60 ఆపై అమ్ముడవుతున్నాయి. చిన్న అనపనకాయ ధర రూ.30 కాగా పచ్చిమిర్చి, అల్లం ధరలు కూడా అల్లాడిస్తున్నాయి. బీన్స్ కిలో రూ.120, బీట్‌రూట్ రూ.60, క్యారెట్ రూ.60, బంగాళా దుంపలు రూ.40, కాకరకాయలు రూ.50కి చేరాయి. వారం, పదిరోజుల వ్యవధిలోనే ధరలు అమాంతంగా పెరిగాయి. కూరగాయలు కొనేందుకు కొంతమంది వెనుకంజ వేస్తుండగా.. కిలో కొనేందుకు వెళ్లినవారు అరకిలోతో సరిపెట్టుకుంటు న్నారు. పండగల సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ముున్ముందు ధరలు ఇంకా పెరగవచ్చని వ్యాపారులు చెబుతున్నారు. ఉల్లి, టమాటా దిగుమతి తగ్గిందని, ఇటీవల కురిసిన వర్షాలు, బంగాళాఖాతంలో అల్పపీడనంతో ధరలు భారీగా పెరిగాయని అంటున్నారు.

అల్లాడిస్తున్న ఆకుకూరలు..

ఎన్నో పోషక విలువలుండే ఆకుకూరల ధరలు కూడా సామాన్యుడికి అందుబాటులో లేవు. గతంలో నాలుగు కట్టల తోటకూర, గోంగూర రూ.20కి లభ్యం కాగా.. నేడు వాటి ధర రూ.30కి చేరింది. బచ్చలకూర, పాలకూర ధరలదీ ఇదే పరిస్థితి. గతంలో రూ.5కే దొరికే కొత్తిమీర కట్ట రూ.10 పలుకుతోంది. కరివేపాకు కట్ట సైతం రూ.10 పైనే.

పది రోజుల్లో భారీగా పెరిగాయి..

వారం, పదిరోజుల్లో కూరగాయలు, ఆకుకూరల ధరలు అమాంతంగా పెరిగాయి. తోపుడుబళ్లపై వీధుల్లోకి తెచ్చి అమ్మేవారి వద్ద గతంలో కాస్త తక్కువ ధరకే దొరికేవి. ప్రస్తుతం వారి వద్ద కొనాలన్నా భయపడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రైతుబజార్‌లో బోర్డుపై కనిపిస్తున్న ధరలకు ఆకుకూరలు, కూరగాయలు అమ్మడం లేదు. అధిక ధరలు తీసుకుంటున్నారు.

- ఆదిలక్ష్మి, గృహిణి, వస్త్రపురికాలనీ, రాజాం

ధరలు రైతులకు దక్కట్లే!

కూరగాయలు, ఆకుకూరలు సాగుచేసే రైతులకు లాభాలు లేకపోయినా దళారులు, చిరు వ్యాపారులకు మాత్రం పంట పండుతోంది. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు సరైన మార్కెట్ సదుపాయం లేక వ్యాపారి అడిగిన ధరకు అమ్మేసి ఇంటిబాట పట్టాల్సి వస్తోంది. రూ.వేలు పోసి సాగుచేసిన పంటను కోసేందుకు తెల్లవారుజాము 2-3 గంటలకే పొలాల్లోకి వెళ్లి.. సూర్యోదయానికి ముందే మార్కెట్‌కు తెస్తున్న రైతుకు మాత్రం ఒక్కోసారి పెట్టుబడులు కూడా రావడం లేదు. రాజాం మార్కెట్‌కు నిత్యం 10 నుంచి 25 కిలోమీటర్లు పయనించి ఉదయం 5 గంటలకే రైతులు పంట ఉత్పత్తులు తీసుకుని వస్తుంటారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని బలిజిపేట మండలం గంగాడ, గళావిల్లి, విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం ఉత్తరావల్లి, సమీప గ్రామాల రైతులతో పాటు తెర్లాం మండలం ఉద్దవోలు, వెలగవలస, పెరుమాళి, రాజాం మండలం గెడ్డవలస, గార్రాజు చీపురుపల్లి, బొమ్మినాయుడు వలస, పెనుబాక, బొద్దాం, సోపేరుతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం మండలం వెలగాడ, జి.సిగడాం, జాడ, జగన్నాథవలస, దేవరపొదిలాం తదితర గ్రామాల రైతులు పంటను రాజాంకు తీసుకువస్తారు. ఇక్కడి మార్కెట్ కూరగాయలు, ఆకుకూరల అమ్మకానికి అనుకూలంగా ఉంటుంది. దీన్ని ఆసరాగా చేసుకుని దళారులు, కొందరు హోల్‌సేల్ వ్యాపారులు ఉదయం 5 నుంచే వేచిచూస్తుంటారు. సిండికేట్‌గా మారి తక్కువధరకే వాటిని కొనుగోలు చేస్తుంటారు. దీంతో పాతిక కిలోల వంకాయలను రూ.500 నుంచి రూ600కే అమ్మాల్సిన పరిస్థితి రైతులకు ఎదురవుతోంది. వాటిని తిరిగి కిలో రూ.40 నుంచి రూ.50 చొప్పున వ్యాపారులు వినియోగదారులకు అమ్మతున్నారు. ధరలు పెరుగుతున్నా రైతాంగానికి ఒరిగేదేమీ కనిపించడం లేదు. కూరగాయల వ్యాపారం లాభసాటిగా ఉండడంతో దళారులు, హోల్‌సేల్ వ్యాపారుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దీంతో వీరంతా సిండికేట్‌గా మారుతున్నారు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో 25 కిలోల వంకాయలకు ఏడెనిమిది వందలు వస్తే, ఇప్పుడు ఐదారు వందలే వస్తున్నాయి. కూరగాయల రైతులకు రాజాం తప్ప దగ్గరలో అమ్ముకునేందుకు మార్కెట్ సదుపాయం లేదు. వ్యాపారులు అడిగిన ధరకు ఇవ్వకపోతే వాటిని ఇంటికి తీసుకువెళ్లాల్సి వస్తుండడంతో రైతులు నష్టాలను మూటగట్టుకోవాల్సి వస్తోంది.

మరో అవకాశం లేదు..

రెండెకరాల భూమిలో వంగ, బీర, చిక్కుళ్లు పండిస్తున్నాను. అప్పుడప్పుడు ఆకుకూరల సాగు కూడా చేస్తుంటాను. వాటిని అమ్మేందుకు రాజాం వెళ్తాను. రాజాం కన్నా బొబ్బిలి పట్టణం దూరం కావడంతో గత్యంతరం లేక ఈ ప్రాంతీయులంతా రాజాం మార్కెట్‌నే ఆశ్రయిస్తుంటాం. దీంతో దళారులు, హోల్‌సేల్ వ్యాపారులు ఆడిందేఆటగా సాగుతోంది. దీంతో వారు అడిగిన ధరకే అమ్మేసి వెళ్లాల్సి వస్తోంది.

-చేపేన రామినాయుడు, రైతు, వెలగవలస, తెర్లాం మండలం

నేటి నుంచే కొత్త పింఛన్లు

(ఐదో పేజీ తరువాయి)

పరిధిలో 4,824 స్పౌజ్ పెన్షన్‌లను తాజాగా మంజూరు చేసింది. అన్ని ప్రాంతాల్లో శుక్రవారం డీఆర్‌డీఏ అధికారులు గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శుల ద్వారా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈపెన్షన్‌లకు సంబంధించి రూ.కోటీ 92 లక్షల 96 వేలను విడుదల చేశారు. ఇదిలావుండగా కొత్తవాటితో కలిపి జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 74వేల 801 ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్‌లు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. సుమారు రూ.116.67 కోట్లను ఆయా సచివాలయాలకు బ్యాంకుల ద్వారా విడుదల చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్‌లను పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు ఎక్కడా ఎటు వంటి లోపాలు లేకుండా పకడ్బందీగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నాం. గ్రామ, వార్డు కార్యదర్శులను అప్రమత్తం చేశాం.

-శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ

స్త్రీ శక్తికి గ్రీన్‌సిగ్నల్

(ఐదో పేజీ తరువాయి)

రాయితీ విషయం అందులో ఉంటుంది. ఉదాహరణకు విజయనగరం నుంచి రాజాం వెళ్లేందుకు రూ.120 టిక్కెట్ ధర ఉందనుకుంటే జీరో ఫెయిర్‌గా చూపుతూ ప్రభుత్వ రాయితీ కింద రూ.120లు చూపుతారన్న మాట. తద్వారా ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఎంత భరిస్తున్నదీ మహిళలకు తెలియజేయనుంది. పథకం పేరు విషయంలో పూర్తిగా స్పష్టత వచ్చింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో విజయనగరం, పార్వతీపురం, ఎస్.కోట, సాలూరు, పాలకొండలో ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. మొత్తం 450 ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. 1.5 లక్షల కిలోమీ టర్లు ప్రయాణిస్తుంటాయి. రోజుకు వీటిలో సగటున 95 వేల మందికి పైగా ప్రయాణం చేస్తుంటారు. అందులో మహిళలు 37 వేల మంది దాటే ఉంటారు. అయితే ఉమ్మడి జిల్లాను ప్రామాణికంగా చేసుకొని మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తారని తెలుస్తోంది. ముఖ్యంగా పల్లెవెలుగు, అల్ట్రాపల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లతో పాటు సిటీ ఆర్డినరీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలుకానుంది. ప్రస్తుతం విజయనగరం జిల్లాకు సంబంధించి 179 సర్వీసులు నడుస్తున్నాయి. మరో 11 బస్సులు ఇటీవల కొత్తగా వచ్చాయి. మహిళలకు ఉచిత ప్రయాణానికి సంబంధించి మరో 20 వరకూ బస్సులు అవసరం అవుతాయి. ఇంకోవైపు మన్యం జిల్లాలో మరో 40 బస్సుల వరకూ అవసరం అవుతాయని అధికారులు అంచనా వేసి పంపించారు.

అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతో సాధ్యం

బొబ్బిలి రూరల్, జూలై31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ మంత్రి, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు అన్నారు. మండలంలోని కొత్తపెంటలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ ఏడాది పాలనలో చేపట్టిన మంచి పనులను వివరించే కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



తొలి అడుగులో మాజీ మంత్రి సుజయ్ కృష్ణరంగారావు

విద్యుత్ చార్జీల దోపిడీని ఆపండి

బొబ్బిలి, జూలై31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పేరుతో ప్రజల నుంచి దోపిడీని ఆపాలని డిమాండ్ చేస్తూ ప్రజావేదిక కార్యకర్తలు గురువారం సంతకాల సేకరణ చేశారు. స్థానిక రెడ్డిక వీధిలో వేదిక ప్రతినిధి పి.శంకరరావు ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల సమస్యలపై ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నెలా 40 పైసలు చొప్పున ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో రూ.2.787 కోట్ల అదనపు భారాన్ని ప్రజలపై మోపారన్నారు. మిగులు ఉందని చెబుతూనే ఇలా అదనపు చార్జీల బాదుడు దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం ఈ భారాన్ని తగ్గించకపోగా చట్ట సవరణ చేసి మరీ కొనసాగించడం చాలా అన్యాయమన్నారు. అదనపు లోడు పేరుతో డెవలప్‌మెంట్ చార్జీలు, వినియోగదారుల నుంచి డిపాజిట్ల నెపంతో వేల రూపాయలను వసూలు చేస్తున్నారన్నారు. రూ.450 కోట్లు ట్రూ డౌన్ ద్వారా తగ్గిస్తామని నమ్మబలికి మోసం చేశారన్నారు. కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. స్మార్ట్ మీటర్లను అడ్డుకునే ఉద్యమంలో ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని శంకరరావు పిలుపునిచ్చారు.



ధర్నా చేస్తున్న ప్రజావేదిక కార్యకర్తలు

గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

బాడంగి, జూలై31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పలు తరగతుల్లో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ఎస్సీ 35, ఎస్టీ 1, బీసీ 2, ఓసీ 1 సీటు ఖాళీగా ఉందన్నారు. ఆరో తరగతిలో ఎస్సీ 10 సీట్లు, ఏడో తరగతిలో ఎస్సీ 5 సీట్లు... ఎనిమిదో తరగతిలో ఎస్సీ 13, ఎస్టీ 1, ఓసీ 1 అందుబాటులో ఉన్నాయన్నారు. తొమ్మిదో తరగతిలో ఎస్సీ 7, ఎస్టీ 3 సీట్లు.. పదో తరగతిలో ఎస్సీ 5, ఎస్టీ 4, బీసీ 2, ఓసీ 1 సీటు ఖాళీగా ఉందన్నారు. అలాగే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో ఎస్సీ 8, ఎస్టీ 2, బీసీ 2 సీట్లు... బైపీసీలో ఎస్సీ 18, ఎస్టీ 2, బీసీ 2, ఓసీ 1.. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో ఎస్సీ 11, ఎస్టీ 1, బీసీ 1, బైపీసీ గ్రూపులో ఎస్సీ 22, ఎస్టీ 2, బీసీ 1, ఓసీ 1 సీటు చొప్పున ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 1 నుంచి 8 లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 7674052952 నెంబరును సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

భూముల వివాదం కొలిక్కి వచ్చేనా?

(ఐదో పేజీ తరువాయి)

దగ్గరగా ఉన్న ఎస్.కోటలో జిందాల్ యాజమాన్యం వద్ద ఉన్న భూముల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నిర్మాణం ద్వారా ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం భావించింది. ఇందుకు అనుగుణంగా అడుగులు వేస్తున్న క్రమంలో భూనిర్వాసిత రైతుల సమస్యలు తెరపైకి వచ్చాయి. 2013 భూసేకరణ చట్టం ప్రకారం తిరిగి భూములను అప్పగించాలని, యాజమాన్యం భూములు తీసుకున్న సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని నిర్వాసిత రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఇన్నాళ్లు మిన్నకున్న భూనిర్వాసితులు ప్రభుత్వం పరిశ్రమల నిర్మాణానికి ముందుకొస్తున్న సమయంలో ఆందోళన చేయడాన్ని నిరుద్యోగ యువత వ్యతిరేకిస్తోంది. నేతలు చూస్తే తలో మాట ఆడుతున్నారు. సమస్య ఎప్పటికి కొలిక్కి వస్తుందో తెలియడం లేదు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి (కాంగ్రెస్) ఉన్నప్పుడు 2008లో జిందాల్‌కు ప్రభుత్వం భూములు అప్పగించింది. ఈ భూములన్నీ అసైన్డ్, ప్రభుత్వ భూములు. సాగులో వున్నవారిలో అత్యధిక శాతం గిరిజనులు. వ్యవసాయం జీవనాధారంగా బతుకు తున్న వీరంతా అప్పట్లో ఈ భూములు ఇచ్చేందుకు ససేమేరా అన్నారు. అసైన్డ్ భూముల చట్టం చూపించి బలవంతంగా లాక్కొన్నారు. జిందాల్ యాజమాన్యం నాలుగేళ్లలో పరిశ్రమను నిర్మించి నిర్వాసిత రైతు కుటుంబాలకు ఉద్యోగం, ఉపాధి, మౌలిక సదుపాయాలు వంటి ఎన్నో హామీలు ఇచ్చింది. ఇదంతా జరిగి 18 ఏళ్లు అయింది.

బాక్సైట్ తవ్వకాలు నిలిచిపోవడంతో కీలక మలుపు

జిందాల్ యాజమాన్యంనకు భూములు అప్పగించిన తరువాత ఆరేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. కానీ పరిశ్రమ ఏర్పాటు చేయలేదు. విభజన అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ పరిశ్రమకు అవసరమైన బాక్సైట్ తవ్వకాలను నిషేధించింది. అరకు ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాలను గిరిజనులు తీవ్రంగా వ్యతిరేకించడంతో ఈ నిర్ణయం తీసుకుంది. జిందాల్ ఏర్పాటు చేసే అల్యూమినియం పరిశ్రమకు ముడిసరుకు బాక్సైటే. బాక్సైట్ తవ్వకాలను గిరిజనులు వ్యతిరేకిస్తున్న విషయం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలుసు. అయినా 834.66 ఎకరాల అసైన్డ్, 151.04 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పగించేసింది. వీటితో పాటు 180.73 ఎకరాల జిరాయితీ భూమిని జిందాల్ యాజమాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసింది. ఇలా ఇక్కడ 1166.64 ఎకరాల భూమి జిందాల్ చేతుల్లోకి వెళ్లింది. టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన బాక్సైట్ తవ్వకాల నిషేధాన్ని సాకుగా చూపించిన జిందాల్ యాజమాన్యం ఈ భూముల్లో పరిశ్రమను స్థాపించలేదు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణం చేపట్టేందుకు 2023 అక్టోబర్‌లో జీవో జారీ చేసింది. తాటిపూడి రిజర్వాయర్ నుంచి ఈ పరిశ్రమకు నీటి సరఫరా చేసేందుకు అంగీకరించింది. ఇదే విషయాన్ని ఈ పార్టీ నేతలు అంగీకరిస్తున్నారు. ఉత్తర్వులు జారీ చేసిన వైసీపీ ఈ భూముల్లో కంపెనీలు నిర్మించేందుకు అవసరమైన చర్యలు తీసుకోకుండా వదిలేసింది. సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం యువత ఓట్లు పొందేందుకు ప్రధాన అస్త్రంగా వాడుకుంది.

కూటమి వచ్చాక..

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారం చేపట్టాక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఉన్న అవకాశాలను అన్వేషించింది. జిందాల్ భూముల్లో పరిశ్రమలను నిర్మించడం ద్వారా ప్రత్యక్షంగా కనీసం 50 వేల మందికి ఉద్యోగాలు కల్పించాలనుకుంటోంది. కానీ నిర్వాసిత రైతుల భూసమస్య అడ్డంకిగా మారింది. ఈ చిక్కుముడి విప్పేందుకు కలెక్టర్ అంబేడ్కర్ ప్రయత్నిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో భూ నిర్వాసితుల నుంచి వినిపిస్తున్న సమస్యలు అధికారుల వద్దకు వెళ్లేటప్పటికి న్యాయ పరంగా నిలబడడం లేదు. ఇక్కడ వీరు చెబుతున్న లెక్కకు అధికారుల వద్దకు చేరిన సమస్యల లెక్కకు సరిపోలడం లేదు. అంతే కాకుండా పీవోటీల విషయంలోనూ అధికారులు ఏ చర్యలు తీసుకోవాలో అర్థం కావడం లేదు. 18 మంది అసైన్డ్‌దారులకు చెందిన 74.15 ఎకరాలకు నష్టపరిహారం ఇచ్చేందుకు చట్టపరమైన అడ్డంకులు ఉన్నాయని అధికా రులంటున్నారు. భూములు తీసుకున్న సమయంలో ఇలాంటి ఎన్నో ఎకరాల భూములకు అప్పటి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించిందని నిర్వాసితుల తరపున పోరాటం చేస్తున్నవారి నుంచి వినిపిస్తోంది. ఇలా ఒకదానితో ఒకటి ముడిపడి వున్న ఈ సమస్యను తేల్చేదెవరో!

త్వరలో 1200 టన్నుల యూరియా

బొబ్బిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ పరిధిలో బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం, తెర్లాం మండలాలకు ఆగస్టు నెలకు సంబంధించి 1200 టన్నుల యూరియా అవసరమని ప్రతిపాదనలు పంపామని వ్యవసాయశాఖ ఏడీ ఎం.మధుసూదనరావు తెలిపారు. త్వరలో యూరియా రానుందని అన్నారు. యూరియా కొరతతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయాన్ని ఆయన వద్ద ప్రస్తావించగా యూరియా లభ్యతపై గురువారం ఆయన వివరణ ఇచ్చారు. ప్రస్తుతం బాడంగిలో 28 టన్నులు, తెర్లాంలో 26 టన్నులు యూరియా ఉందన్నారు. ప్రతీ వారం మార్క్‌ఫెడ్ నుంచి యూరియా సరఫరా అవుతోందన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ప్రతీ వారం యూరియా ర్యాక్‌లు వస్తాయన్నారు. ఉభాలు ముమ్మరంగా అవుతున్న ప్రాంతాలకు యూరియాను రైతులకు పంపిణీ చేస్తామన్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియాను అందుబాటులో ఉంచామన్నారు. మండలానికి 50 లీటర్ల చొప్పున సిద్ధం చేశామన్నారు. ఎకరాకు అర లీటరు చొప్పున నానో యూరియాను పిచికారీ చేయవచ్చన్నారు. రైతు సేవాకేంద్రాల ద్వారా యూరియా పంపిణీని పగడ్బందీగా నిర్వహిస్తామని ఏడీ వివరించారు.



వ్యవసాయశాఖ ఏడీ మధుసూదనరావు

మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దు

బొబ్బిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో గురువారం పోలీసులు సంకల్ప రథం ద్వారా విద్యార్థులకు పలు అంశాలపై సీఐ సతీష్‌కుమార్ అవగాహన కల్పించారు. గొల్లపల్లిలోని వేణుగోపాల మున్సిపల్ హైస్కూల్‌లో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై లఘు చిత్రాలను ప్రదర్శించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు వినియోగం, అమ్మకం, రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జీవితాలను సర్వనాశనం చేసే ఇలాంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని హితవు పలికారు. అలాగే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి సమాచారం అందజేయాలన్నారు. తల్లిదండ్రుల కలలను నెరవేర్చేందుకు విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు, హెచ్‌సీలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ

నీటి తీరువా బకాయిలపై వడ్డీ మాఫీ

బొబ్బిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గత ఆర్థిక సంవత్సరంలో రైతుల నుంచి రావాల్సిన నీటి తీరువా బకాయిలపై వడ్డీని మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం జీవో 262ను జారీ చేసింది. 2024-25 సంవత్సరానికి రైతుల నుంచి రూ.85.81 కోట్లు బకాయిలు వసూలు కావాల్సి ఉంది. దీనిపై వడ్డీని ప్రభుత్వం తాజాగా మాఫీ చేస్తూ రైతులకు వెసులు బాటు కల్పించింది. గురువారం చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.విజయలక్ష్మి నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఘనంగా రాఖీ పండుగ ప్రారంభం

బొబ్బిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రహ్మకుమారీస్ ఆధ్యాత్మిక కేంద్రంలో గురువారం రాత్రి రాఖీ పండుగ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేంద్ర నిర్వాహకురాలు బీకే రాజేశ్వరి ఆధ్వర్యంలో యోగా గురువు ప్రసాద్‌కు ఆమె రాఖీ కట్టి ఆశీర్వచనాలు అందజేశారు. మౌంట్ అబు నుంచి వచ్చిన ప్రత్యేక రాఖీని ప్రసాద్‌కు ఆమె కట్టారు. ఈ సందర్భంగా బీకే రాజేశ్వరి మాట్లాడుతూ ఆగస్టు 9 న ఐదు మండలాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలను కన్నుల పండువగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ యోగా గురువు చంద్రమౌళి, 40 మంది రాజయోగసాధకులు పాల్గొన్నారు.

పథకాలపై విస్తృత ప్రచారం చేపట్టండి

బొబ్బిలి జూలై 31 (ఆంధ్రజ్యోతి): కేంద్రం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. ఇటీవల బీజేపీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన ముగడ అనిల్‌కుమార్ యాదవ్ గురువారం ఎమ్మెల్యేను బొబ్బిలి కోటలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బేబీనాయన ఆయనను అభినందిస్తూ దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో చావు దెబ్బతిన్న పార్టీ నాయకులు దుష్ట పన్నాగాలు పన్నుతున్నాయన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడుతూ అరాచకాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ పాలన అద్భుతంగా ఉందని జనమంతా ఎంతగానో సంతృప్తి వ్యక్తం చేస్తున్నప్పటికీ వైసీపీ నాయకులు ఇందుకు విరుద్ధంగా దుష్ప్రచారాలకు ఒడిగడుతున్నారన్నారు. ప్రజలు ఛీత్కరించినా వారిలో మార్పు రాలేదన్నారు. వారి తీరు తెన్నులపై ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూ ప్రభుత్వ పథకాలు అందరికీ సక్రమంగా అందేలా పర్యవేక్షణ చేయాలని అనిల్‌కు ఎమ్మెల్యే సూచించారు. జిల్లా బీజేపీ కార్యదర్శిగా విజయవంతంగా బాధ్యతలు నిర్వహించాలని కోరారు.



అనిల్‌యాదవ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

దివ్యాంగులకు ఉపకరణాలు

రామభద్రపురం, జూలై31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో గురువారం సమగ్రశిక్ష సహకారంతో దివ్యాంగ విద్యార్థులకు ట్రైసైకిళ్లు, వీల్‌చైర్స్, వినికిడి యంత్రాలను ఎంఈవో తిరుమలప్రసాద్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా దివ్యాంగులకు రవాణా భత్యం, బాలికలకు స్టైఫండ్, ఫిజియో థెరపి, పెన్షన్లు వంటి సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. దివ్యాంగత్వం అనేది శరీరానికే తప్ప మనసుకు కాదన్నారు. లోపాలను అధిగమించి అందరితో పాటు ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో భవిత ఐఈఆర్‌పీలు చింతల రాజేశ్వరి, గండి తేజశ్విని, దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉపకరణాలను అందజేస్తున్న ఎంఈవో







